

# ఎంపు

రచన : చాగంటి సోమయాజులు

పెళ్ళినాడు ఏంచంబర పడ్డాను! డప్పులు యీరణాలు, బజంత్రీలు, బాకాల్తో పాలెం ఎగిరిపోయింది. పెళ్ళి మా వోయిబవంగా అయింది. ఏంచంబరపడ్డా నేం చంబర పడ్డాను!

కొబ్బిరాకుల పందిరేసినారు. పెళ్ళిపీను అలంకరించినారు. తోరణాలు, గెలల్తో అరిటిసెట్లూ, రంగు కాయితం బుట్టలు—పీర్ల పంజరం నాగైపోయింది గుడిసె!

పసుపూ పారాయ రెట్టుకుని, మెడనిండా గందాలు పూసుకుని, కొత్తకోకలు కట్టి పేరంటోళ్లు, సంకల్లోగొడుగు లెట్టుకుని, సిలుకు కండువాలు తలపాగాలు సుట్టి సాకళ్లువొచ్చి పాలెం నిండిపోనారు.

అరవై రూపాయల ఆవీతి చేసినాము! గూనల్లో కల్లు నూతినీళ్లలా నింపినాము. గొత్తిపోతుల్ని ఏసినాము. మా వోయిబవంగా అయింది పెళ్ళి. ఏం చంబర పడ్డా నేం చంబరపడ్డాను!

మాయయ్య మేనల్లుడు దాలిగోడు. దిక్కు లేకపోతే గంజినీళ్లు పోసి మాయయ్యే పెంచినాడు. మామావాఁ నేనూ ఒక్క నాగ పెరిగాము. ఒక్కసోట పెరిగాం.

దాలిగోడు తక్కువోడా? ఎంతెంత సంగిడీలైనా పొడిచేస్తాడు. బుగ్గమీసాలు రాజులు, ఎర్రరోసాల ఎలమలు నాదాడిగోడి తోటి పంజాకలపడమే?

అడ్డెడు బియ్యం పన్నం, కుండెడు గోంగూకు పులుసూ ఆడికి సిన్నప్పుడే సాలేదికాదు. పర్వతాల్లాంటి గుడ్డలమూటల్ని కావిడేసి పది కోసులైనా ఇసురుకు వొచ్చేవోడు.

ఆడి దండల్నీ, గుండెల్నీ సూసుకోంటూ రేవులో గుడ్డలు గుంజడం మరిసిపోయా దాన్ని.

ఎంత చంబరు పడ్డానో అంతా అయింది. పెల్లి తోటొచ్చింది పెమాదం. అరవై రూపాయల ఆవితి. ఎన్నాళ్లు ఎన్ని మురిగ్గుడ్డలు ఉతికితే అరవై రూపాయలయేను? అరవైరూపాయలు పాపంనా పెరుగుతూ ఒడ్డీకొడ్డీ.

ఎనాగ తీర్సడం? బుర్రలు బద్దలు కొట్టుకోని మాయయ్య, నాదాలిగోడు ఆలోసించినారు. ఆఖరికి తెగించినారు. నాదాలిగోణ్ణి రంగ పంపేరు. నన్ను ఒగ్గనేక ఒగ్గనేక రెండు వోరాలు నసికి నసికి ఎళ్లిపోనాడు నాదాలిగోడు. గొల్లున ఆనాడే ఏడ్సినాను.

దపదపా డబ్బు పంపుతానన్నాడు. అప్పు తీరగానే ఇంటి కొస్తానన్నాడు. ఎన్నెన్నో సెప్పినాడు. ఎందుకూ? ఆరుమాసాలయింది. పట్టున పదిరూపాయిలు పంపలేదు. ఉత్తరంలేదు. పత్తరం లేదు. చమచ్చరమై పోయింది. అస్తీగ స్తీనేదు.

గరికిపేట సాకలోడు తిరిగొచ్చి సెప్పినాడు. దాలిగోడు రంగంలో లాండరీ పెట్టినాట్ట. నిజమో అబద్ధమో. బరమా గుంటని మరిగినాట్ట. వూళ్లో వోళ్లంతా ఇంక ఆడు మనోడు కాడు, ఇంకో మనువు సూసుకోమే అన్నారు!

నన్ను మోసం చేస్తా నా దాలిగో అని ఏడ్సినాను. మొగుడంటే దాలిగోడే, అలాటి మొగుడంటే మారుమొగాడి మొహం ఏ యాడదీ సూడదు.

మాగేమంలో నాలుక్కొంపల పనీ సేసుకోంటూ, నాలుగ్గింజలు తెచ్చుకోని గంజినీళ్లు తాక్కునా దాలిగోడు రంగమంట లాండరీపెట్టి నాకు అనియాయం సేస్తాడా? నానిక్కడింకో మనువుకిపోనా? బుద్దికి నచ్చనేదు. లోపల బెమ ఉండేది. ఎవరేమన్నా సెడ్డబెమ ఉండేది.

వోరం వోరం అనుకొనేదాన్ని. వోడలో నాదాలిగోడు దిగుతాడని. నాను రేవులోఉంటే, రేవువోరతోవలోంచి రంగుగళ్ల లుంగీ కట్టి సిలుకు సొక్కా జోళ్లు తొడిగి, రంగు బిళ్లల జోడు కళ్లకి తగిలించి, పెద్ద బుట్ట కాపింగుతో నా దాలిగోడు మా కోచం పెద్ద పందిరిమంచం కావిడి పెట్టెలు పట్టించుకొని, కుండెడు రూపాయి లట్టుకొని వొస్తాడని సెడ్డబెమ పడేదాన్ని. సెడ్డఆశ పడేదాన్ని.

రెండేళ్లానాది ఆసలు గడియాస లానాయి.

ఇంక ఊళ్లోగొడవ, ఎదవ గేమాల్లోరంకుతనం తప్పనేదు! గర్లంట గడ్డికిపోతే ఇదే గోల. పొలాల్లో పనికిపోతే ఇదే సంత. పుట్టసాపైతే సిక్కు. ఒంటరిగా ఆడదుంటే పెమాదం. ఆడకీ మొగకీ పొద్దస్తమానం రంకు గొడవే, పెద్దలకీ పిన్నలకీ ఇదే పోగాలం.

ఆడాళ్లదీ తప్పే. పొగాకు ముక్కకీ సిద్దమే. సంతనాడు పకోడీ పొట్లాముకీ సిద్దమే. ముండ గేమంలోమనసు కట్టుకొన్న మాలచ్చిమి ఒక్కత్తె నేదు!

"ఒలే సాకలీ ఏ మంటావు" అని పెతీ ఎదవా అడగడమే, సున్నపుకాయలో నాలుగు డబ్బులున్న పెతీ సెత్త ఎదవా "సాకలీ" అంటే "ఓయ్" అంటుందనుకొంటాడు!

"ఏమంటావు సాకలీ ఏమంటావు?"

పెపంచాన్న నాలి, రోజంతా నడుమొంచి, తొడనోతు బురదలో దిగడి, ఊడిస్తే బేడ్డబ్బులు కూలికిబొచ్చావొస్తున్నాది. ఆడది రంకుకుపోతే? నాలుగుపుట్ల నేలున్న నాయుడితోటో, డబ్బున్న బాపనోణ్ణోపట్టి సంతనాడు సెయ్యిజాపితే వుప్పలా వొర్రా మొర్ర తీరుతుంది. పంటనాడు పదికుంచాలు తేరగా దొరుకుతాయి, సిల్లరా మల్లరా సింవాలచ్చిమి అడపాదడపా వొస్తానే ఉంటుంది. ఆడది వొప్పుకోక ఏం చేస్తాది? నూసీ సూణ్ణాట్టు, కడుపు కాలుతున్న మొగుడూరుకోక సస్తాడా? ఎదవ నోకం!

మాయమ్మ నడిగినాడు పెద్దబుగతగోరి కొడుకు శాత్తిరి. శాత్తిరికేం ? ఎన్ని ఏషాలైనా ఏస్తాడు, ఎయ్యిరూపాయిలు సిస్తు లొస్తాయి, ఐదుగరిసెల సేలీఉంది, పెద్ద మామిడి తోటుంది. బాబు ఎవారాల్లో నాదారుల్ని దిబ్బసేసి రెండుసేతులా దోస్తున్నాడు. శాత్తిరిపట్నాలంట పదేళ్లుండి పెద్ద పెద్ద సదువులు సదువుకొచ్చినాడు పల్లెటూళ్లో పనాపాటా? శాత్తిరికి పడుచుపిల్ల కనపట్టం తప్పా, రూపాయి అర్ధా మొల్లోదోపి పొద్దస్తమానం తోటలంట, పెండెలంట పుస్తకమోటి సంకనెట్టి షైరులు తిరుగుతాడు షైరులు!

“నీకూతుర్ని నాకు కుదుర్సు” అని మాయమ్మ నడిగాడు శాత్తిరి. ఏం దురన్నాయం!

మాయమ్మ అందట “నాయినగోరూ నా కూతురొప్పుకోదు. అదొప్పుకుంటే మాకొంపకిన్ని పాట్లెందుకు” అందిట. “ఏంటే మీ కష్టాలు” అనడిగినాట్ట శాత్తిరి. మాయమ్మ సెప్పుకుంది. నా పెళ్లి ఆవీతికయిన కరుసు, పీకలమీదప్పు. వొడ్డీకి వొడ్డీ, దాలిగోడు రంగ మెళ్లడం కష్టం సుఖం సెప్పుకుంది.

“ఒస్సింతేటే మీయప్పు నూటాపాతిక రూపాయలు తీరుస్తాను. నీ కూతుర్ని నాక్కుదుర్సు” అని పట్టుపట్టినాడు.

మాయమ్మ మొకం పెద్దదైపోయింది, అప్పు తీరుతుందంటే మాయమ్మ ఎందుకేనా ఒప్పుకొంటుంది. “ముందర డబ్బుఇయ్యి, దాని మెడలొంచుతాను” అన్నాది. నూటాపాతికా పుచ్చుకొంది. అది నాకు సూపుతూ సెప్పింది. వొద్దుగాక వొద్దన్నాను. మూడురోజులు పట్టు పట్టినాను. సాగిందికాదు!

నామూలంగా, నామొగుడి మూలంగా సెడిపోయినారు. కష్ట పడుతున్నారు. నాదాలిగోడు అద్దోన్నం చేసినాడు. పీకలమీదప్పు కొంపమీదికొచ్చింది. అందుకోడ బడ్డాను!

శనారం మద్దేన్నం. మాసాకి రేవుకి దగ్గరగా ఊట గెడ్డవూర శాత్తిరికి మామిడి తోటున్నాది. నాకు బాగా యాదస్తుండి పోయింది. సిక్కగా బలిసిన మొగిలిపెండి. జనుము బలిసిన ఊబీ, అమ్మోరు జుట్టు నాగ పొడనేస్తా సున్నపుబట్టీ, ఆ మారుమూల మామిడిసెట్టు కింద ఇసకనేల, అక్కడకెళ్లా శాత్తిరికోసం.

శాత్తిరి పిన్నవోడే, పెళ్లానాకానేదు. సీ! ఎందుకు? ముతక మాట అనకూడదు కాని శాత్తిరి పురుషజనమ మెత్తనేదు. ఉత్త బొమికెలగూడు, పైకి నిండా సలవ బట్టలేసుకొన్న గాజు కాయ కన బడతాడు.

కాని సెడ్డ ఏడ్చినాను ఎయ్యిరూపాయలిచ్చినా సెడ్డబతుకు సెడ్డబతుకే, శీ! దాలిగోడికి అపచారం చేసినాను. ఆడు తిరిగొస్తే ?

సమాదానం సేసుకొన్నాను. సిల్లర ఎదవల్తో పోనేదు. అమ్మకి అయ్యకి బాదలు తీరినాయి. బుక్కెడు గంజినీల్లు కలిగినాయి.

శాత్తిరి మాం బాగా మరిగినాడు. నూటాపాతిక రూపాయలు ఇచ్చుకొన్నాడు. వొట్టినే ఇచ్చుకొన్నాడా? మామిడితోటలో సాలే యించినాడు, సిన్నసాల, మాయిమ్ముగా ఏయించినాడు. కుంసీలు, బల్ల, మంచం ఎట్టేడు. కాపీకి మరపొయ్యి ఎట్టేడు. బీరువా నిండా పుస్త కాలు నింపేడు. అక్కడ నన్ను కూకో ఎట్టుకొనే వూడు.

నా సక్కదనం రోజూ వొరిణించేవోడు. సెంపకి సేరడేసి బేషి సెల్లాకళ్లు, మొగిలిముళ్లలాపళ్లు, వోటంగావొళ్లు. అవయవాలన్నీ ఇసిత్తరంగా—సిగ్గుసిగ్గు—వొరిణించే వోడు.

అందంకాకేటి నాకు ? నాయిాడు వోళ్లంతా ముగ్గురేసి సంతా నం కలిగి ముసిలోళ్లయిపోనారు. బొట్టెలునేరు; గట్టిగున్నాను. గుడ్డలు గుంజి, కడుపెక్కాతిని కొవ్వెక్కి ఉన్నాను. అందంకాకేటి నాకు? ముక్కుసొట్టా మూతి వొంకరా? శాత్తిరి నావొళ్లుసూస్తూ సీతాకోకల్లా కళ్లు ఎగిరించే వూడు.

అమేళ శుక్కురవోరం. రేవులో ఉన్నాను. మాయమ్మ శాత్తిరి గోరొచ్చి ఉంటారు తోటలోకెళ్లు అని పొడిచి పొడిచి సెప్పింది. అమ్మ ఎళ్లమందూ? అడిగినప్పుడల్లా రూపాయి అర్ధా అడిగినంతా ఇచ్చుకొస్తున్నాడు.

కనుసూపు మేరలో ఎవరో జట్టు మనుషులొస్తున్నారు. తేరబారి సూసినాను. కంటికానింది. నిరగాంతపోయి నిలుసున్నా.

"వొస్తున్నాడు వొస్తున్నాడు! నా మొగుడు! నాదాలిగోడు. నా దాలిగోడు!" అనుకొంటూ చూసినాను. దుక్కమాగిందికాదు— పున్నానికి సముద్రంలా పొంగిపోయింది. గుండెలు కుండలో కోడిలా గుడికిపోయింది. నరాలు తోడుకుపోయి, పేగులు పిసుక్కుపోయి కుప్పలా కూలబడి నెత్తికి సేతులెట్టుకు ఏడిసినాను..

ఎదవ అప్పు తీరకపోతేఏం? గంజినేక పస్తులుంటేఏం? మూణ్ణాళ్ల బతుకు తెల్లారకపోనా? నాదాలిగోడి కపచారం చేసినాను. సెడిపోనాను. కన్నీళ్లు ఏకదారగా కారినాయి. వొళ్లంతా కరిగి, కన్నీళ్లై, కాలవగట్టి, మాయదారి సాకిరేవుకాడ, ఊటగెడ్డలో కలిసిపోకూడదూ? బండలా మరింత బరువెక్కి బతికినాను బతుకు!

దాలిగాడు దగ్గరకొచ్చి ఎన్నుమీద సేతులేసి "ఓ వేడవకే నానొచ్చినాను" అంటూ లేవదీసినాడు. పాడు మొహమెత్తి సూపనేక సూపనేక తలెత్తినాను. మబ్బులు కమ్మిన కళ్లకి మసక మసగ్గా కనబడ్డాడు. కళ్లునులుముకు సూసినాను. నాదేముడు నాదగ్గర కొచ్చినాడు. జనమకేటికావాల?

మాయిడితోటా, మాయదారిసాలా, జనుము బలిసిన ఊబీ, కళ్లలో ఎదురుగా కనబడ్డాయి. నోటిలో తెల్లగా సిగరెట్టు ఎట్టుకొని ఇసకపజ్జని పచారులు చేస్తున్నాడు శాత్తిరి. పొద్దున్నే షికారు కొచ్చాడు షికారు! ఇంకా తోటనోకొస్తా ననుకొంటున్నాడుగామాల! ఈళ్ల బుర్రపడిపోను.